ట్రేడింగ్.. మోసాలు లోడింగ్

తక్కువ పెట్టుబడి.. ఊహించని ఆదాయం.. పైగా అరచేతిలో.. అంతా క్షణాల్లోనే సొమ్ము చేసుకోవచ్చని నమ్మిన అమాయకులెందరో సైబర్ కేటుగాళ్ల వలలో పడి మోసపోతున్నారు. సెల్‌ఫోన్ యాప్‌ల ద్వారా ఉన్నది, దాచుకున్నది, అప్పుతెచ్చుకొంది అంతా ఘరానా మోసగాళ్లకు కూడబెట్టి ముట్టచెబుతున్నారు. ఓటీపీ, లింకల ద్వారా జరుగుతున్న మోసాలు క్రమేపీ ట్రేడింగ్ పేరుతో పెద్ద మొత్తంలో కుచ్చుటోపి పెడుతున్నారు. ఇటీవల పోలీసులు ఛేదించిన కేసులు, వాటి పుర్వాపరాలు, బాధితుల ఫిర్యాదుల్లో పేర్కొన్న విస్తుపోయే నిజాలెన్నో విస్తుగొలుపుతున్నాయి.. - ప్రజాశక్తి-పుంగనూరు

- ఆశతో పెట్టుబడి.. ఆపై మోసాలకు బలి
- సైబర్ నేరగాళ్ల ఘరానా దోపిడి
- అత్యధికంగా మోసపోతున్న విద్యావంతులు
- పుంగనూరులో వెలసిన బినామీ కార్యాలయాలు
- ఓ కేసుకు సంబంధించి ఇటీవలే తెలంగాణ పోలీసుల సోదాలు

దోపిడీకి కాదేది అనర్హం అన్న చందంగా కేటుగాళ్ల అమాయకులను లూటీ చేసేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ యాప్‌లు, లింక్‌లు, ఓటీపీ, ట్రేడింగ్ పేరిట అందిన కాడికి, అబ్బింది సైబర్ మోసాలకు పాల్పడి చాటుగా చటుక్కున సొమ్ము లాగేసుకుంటున్నారు. అధిక లాభాలతో ముందుగా నమ్మించి ఆపై ఆశచూపి లక్షల రూపాయలు స్వాహా చేస్తున్నారు. స్టాక్ మార్కెట్ పేరుతో యాప్‌లు రూపొందించి, వాటి ద్వారా విద్యావంతులు, ఉద్యోగస్తులు, వ్యాపారులను టార్గెట్ చేసి మోసాలే పెట్టుబడిగా పెడుతున్నారు. ఈ రొంపిలోకి దిగిన అమాయకపు ప్రజలు ఉన్నది, లేనిది అప్పు చేసి పెట్టుబడి పెట్టి ఇట్టే మోసపోతున్న ఉదంతాలు తేటతెల్లమవుతున్నాయి.

ఆశ చూపి.. అంతలోనే మోసం

తక్కువ పెట్టుబడి అధిక లాభాలు వస్తాయని ముందుగా సెల్‌ఫోన్‌లో యాడ్‌లు, లింకులు, యాప్‌లతో ఎర వేస్తారు. పెట్టుబడి రెట్టింపై ఆదాయం వస్తుందని నమ్మిస్తారు. ఆపై కొంతపెట్టుబడికి కొంతసొమ్ముకలిపి లాభమని ఆశ చూపుతారు. నమ్మిన అమాయకులు అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టేదాకా వరుసగా విసిగిస్తారు. పెట్టుబడి వేలల్లో, లక్షల్లో వేచ్చేందాకా మళ్లీమళ్లీ ఆఫర్‌లు ఇస్తారు. అధిక మొత్తం రాబడి వచ్చాక ట్యాక్స్, కమీషన్ పేరుతో సొమ్మును హోల్డ్ చేసి ఇంకొంత చెల్లిస్తే ఇస్తామని తిరకాసుపెడతారు. అంతలోనే మయామై స్పందన లేకుండా పోతారు. ఇదంతా మోసమని తెలుసుకున్నాక.. బాధితులు పోలీసులను ఆశ్రయించి లబోదిబోమంటున్నారు.

స్టాక్ బ్రోకర్లమంటూ..

స్టాక్ బ్రోకర్లమని ఆన్లైన్లో సైబర్ నేరగాళ్ల ప్రత్యక్షమవుతున్నారు. కొత్తగా ప్రవేశించే వారిని ఆకర్షించి ఏ సంస్థ షేర్ ధర ఎంత పెరుగుతుంది తమకు తెలుస్తుందని ఉదయం పెట్టుబడి పెడితే సాయంత్రం వరకు లక్షల కళ్ళు చూడబోతున్నదని నమ్మిస్తారు. మొదట్లో లాభాలు ఇస్తారు. నకిలీ షేర్లు మన ఖాతాలో ఉన్నట్లు చూపిస్తారు. ఇందుకోసం ఒక యాప్ డౌన్లోడ్ చేసుకోవాలంటూ అందులో పేరు ఖాత వివరాలు నమోదు చేసి పెట్టుబడి పెట్టగానే భారీగా లాభాలు వచ్చినట్టు కనిపిస్తాయి. తద్వారా మరిన్ని పెట్టుబడులు పెడతారు. తీరా ఆ డబ్బు డ్రా చేసుకుందామంటే మాత్రం వివిధ అడ్డంకులు ఎదురవుతాయి. గట్టిగా అడగటం తదుపరి పెట్టుబడి నిరాకరించడం చేయగని దుకాణం ఎత్తేస్తారు.

ప్రధాన పట్టణాల్లో వెలసిన కార్యాలయాలు..

చాటుగా చేస్తున్న దోపిడీని కాస్త తెరముందుకొచ్చి కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రధాన పట్టణ కేంద్రాల్లో ప్రస్తుతం బొర్డులు వెలుస్తున్నాయి. 'తక్కువ పెట్టుబడి-అధిక లాభం' పేరిట ఆకర్షించే హోర్డింగ్‌లతో ముందుకొస్తున్నారు. తాజాగా పుంగనూరులో ఇలాంటి కార్యాలయాలు కనిపిస్తున్నాయి. కాగా తాజా హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు పుంగనూరులో ట్రేడింగ్ పేరుతో ఏర్పడ్డ ఓ కార్యాలయంలో సోదాలు నిర్వహించాారు. తెలంగాణలో నమోదైన కేసుకు సంబంధించి వివరాలను రాబట్టారు. అక్కడి కంప్యూటర్‌లు, ఫైల్‌లు వంటివి స్వాధీనం చేసుకున్నారు. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని, కంపెనీ వివరాలను పూర్తిగా సేకరించి అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారాన్ని గమనించిన స్థానికులు ఒక్క సారిగా కంగుతిన్నారు.

రూ.50లక్షలు మోసపోయిన ప్రభుత్వ టీచర్..

పుంగనూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు ఇటీవల రూ.52లక్షల ఆన్లైన్లో పెట్టి మోసపోయి చివరికి పోలీసులను ఆశ్రయించింది. ఈమెకు ఓ యాప్ ద్వారా ఆన్లైన్ వ్యాపారంటూ పరిచయం కావడం, మొదట రూ.లక్ష పెట్టుబడి పెట్టడం దానిలో రూ.50వేలు లాభం చూపించారు. అలాగే రెండు లక్షలు పెట్టుబడికి రూ.50వేలు లాభం రావడం జరిగింది. వ్యాపారంలో మంచి లాభాలు వస్తాయి అని 5 నుంచి రూ.52లక్షల వరకు పెట్టుబడి పెట్టింది. విషయాన్ని ఇంట్లో కూడా ఎవరికీ చెప్పకుండా అధిక లాభం వస్తుంది వ్యాపారం చేసింది. అందులో పెట్టుబడి గాను కొత్త ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలో 10లక్షల రూపాయలు, తను వద్ద ఉన్న బంగారు నగలు తాకట్టు పెట్టి పది లక్షలు, వడ్డీకి తీసుకొని రూ.పది లక్షల పెట్టడం జరిగింది. ఇలా మొత్తం రూ.52లక్షల పెట్టుబడి కాగా రెండు నెలలు తరువాత విత్ డ్రా చేయడానికి ప్రయత్నించగా దీనికి టాక్స్ చెల్లించాలని, ఇంకా వివిధ రకాలుగా రూ.10లక్షలు మీరు చెల్లిస్తే డబ్బులు డ్రా చేసుకోవచ్చనివారు మోసపూరిత మాటలు చెప్పారు. దీంతో చివరికి మోసపోయామని తెలుసుకొని పుంగనూరు పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

పెద్దిరెడ్డి పాపాలపై కమిటీ వేయాలి..!

- గత అయిదేళ్ల అరాచకాలు నిగ్గు తేల్చాలి
- బాధితులకు న్యాయం చేసి, దోషులను శిక్షించాలి
- పెద్దిరెడ్డి కుటుంబం దోచుకున్నది కక్కించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకి బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ లేఖ

ప్రజాశక్తి-పుంగనూరు: అధికారం అడ్డం పెట్టుకొని.. అరాచకాలు, అక్రమార్జన చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహారంపై నిజాలు నిగ్గు తేల్చి, అక్రమాలు బయట పెట్టేందుకు కమిటీలను నియమించాలని.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి శుక్రవారం లేఖ రాశారు. పెద్దిరెడ్డి దోచుకున్నది కక్కించి, అతని బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ.. పలు కీలక అంశాలు ఈ లేఖలో ప్రస్తావించారు. చిరస్మారకమైన విజయాన్ని సాధించడం చారిత్మాకంగా పేర్కొన్నారు. సీఎంగా 4వ సారి బాధ్యతలు స్వీకరించడంపై శుభాకాంక్షలు తెలిపారు. కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చి, గత పాపాలను కడిగి, రాష్ట్రానికి తగిలిన గాయాలను రూపుమాపి, మంచి చేస్తూ.. గతంలో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా చూసుకుంటారని విశ్వసిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. సొంత జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనే అరాచక రాజ్యాంగేతర శక్తి ఎన్నో పాపాలు, పథకాలతో రాజ్యమేలింది.. వాటిపై సమగ్ర విచారణ జరిపుతారని కోరారు. గత ఐదేళ్లలో మంత్రిగా, అధికారం అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి గనుల్లో విచ్చలవిడిగా దోచుకున్నారు. ప్రతీ క్వారీ, ప్రతీ ఖనిజ నిక్షేపాల్లో తమ అనుచరులను పెట్టి అక్రమార్జన చేశారంటూ లేఖలో వివరించారు. విద్యుత్తు శాఖలో కాంట్రాక్టులు, ఒప్పందాలు, కేటాయింపులు ద్వారా రూ.వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారు, వీటిపై విచారణకు ఒక ప్రత్యేక కమిటీని వేసి నిజాలు నిగ్గు తేల్చాలంటూ విన్నవించారు.

బక్రీద్ త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీక..

- ఈ పర్వదినాన్ని సుఖ శాంతులతో జరుపుకోండి
- ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సుఖ శాంతులతో ఈ పర్వదినాన్ని జరుపుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా గత కొన్ని రోజులుగా ముందస్తు భద్రత చర్యలలో భాగంగా మసీదుల వద్ద, ముస్లిం ప్రజలు నివసిస్తున్న ప్రదేశాల నందు మత పెద్దలతో పోలీసు అధికారులు సమావేశాలు జరుపుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి సమస్యలు రాకుండా ప్రార్థనా సమయంలో, ఇతర కార్యక్రమాలు జరుపునప్పుడు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచిస్తూ విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. అమలులో ఉన్న Cow Protection Act, 2017 చట్టం ప్రకారం గోవులను వధించడం చట్టరీత్య నేరం, గోవులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశంకు తరలిస్తున్న సందర్భాలలో తగిన పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు, మత సంఘర్షణలు ఉత్పన్నం అయ్యే విధంగా ఎవ్వరు ప్రవర్తించకూడదని "ప్రేరేపించకూడదు" అని హితవు పలికారు. ఎక్కడైనా అసాంఘిక, అనైతిక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112 లేదా లోకల్ పోలీస్ వాట్సప్ నెంబర్ 9440900005కి తెలపాలని కోరారు.

చిత్తూరు నగరాభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిత్తూరు ఆర్అండ్‌బీ అతిథి భవనం సమావేశ మందిరంలో నగరపాలక కమిషనర్ డాక్టర్ జె.అరుణతో కలిసి నగరపాలక సంస్థ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు కమిషనర్.. ఎమ్మెల్యేకు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. శాఖల అధికారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. చిత్తూరు నగరాభివృద్ధికి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, అధికారుల సైతం సమన్వయంతో పనిచేయాలన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థను ఉత్తమంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు 'ఇజ్రాయిల్ మారణహోమం'పై సదస్సు

ప్రజాశక్తి - రేణిగుంట: పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమాన్ని ఆపాలంటూ సంఘీభావ సదస్సు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఒ.వెంకటరమణ తెలిపారు. ఎన్నికల సమరంలో పడి పాలస్తీనాలో మారణహోమం జరుగుతున్నా మనం సరిగ్గా స్పందించలేకపోయామన్నారు. ఇజ్రాయిల్ బాంబుల ఫిరంగులు, డ్రోన్ల దాడుల్లో మరణించిన వృద్ధులు, మహిళలు, పసికందుల గురించి ఒకసారి స్మరించుకోవాల్సి ఉందన్నారు. 40వేల మంది సామాన్యులు చంపబడ్డారన్నారు. ప్రపంచశాంతిని కోరుకునే అందరికీ ఆహ్వానమని అన్నారు. ఇజ్రాయిల్ అహంకారంతో అమెరికా అండదండలతో పాలస్తీనాలోని గాజా, రఫా ప్రజలపై జరుపుతున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రేణిగుంట ఫ్లైఓవర్ వంతెన కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సుకు ప్రధాన వక్తలుగా సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, జెవివి నాయకులు షరీఫ్, ఆవాజ్ నాయకులు ఢిల్లీబాష తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఇండస్ట్రీయల్ కారిడార్ త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైజాగ్ -చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివద్ధి పనులలో భాగమైన ఏడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణ ల విషయాలు తదితర పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పీడీ ఎన్హెచ్ఎఐ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, జిల్లా ఆర్ అండ్ బి అధికారి మధుసూదన్ రావు, ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, తిరుపతి స్పెషల్ ప్రాజెక్ట్స్ జోన్ జడ్ ఎం, నెల్లూరు విజయరత్నం, డిప్యూటీ జడ్ఎం చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ విజయవంతం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అత్యవసర పరిస్థితులు ఎదురైనపుడు వేగంగా ప్రతిస్పందించే తీరును మెరుగుపరిచే ప్రయత్నంలో ఇండియన్ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో ప్రముఖ సంస్థ ఎజి అండ్ పి ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో లెవల్ 3 మాక డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజులమండ్యంలోని కోకో స్టేషన్‌లో ఈ డ్రిల్ నిర్వహించారు. గాజులమండ్యం ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. సంస్థ ప్రతినిధులు శ్రీను, గౌతమ్ ఆనంద్, శబరిబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ని ముందస్తుగా గుర్తించాలి

- రాష్ట్ర పరిశీలకులు సునీల్ కుమార్ నాయక్

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: క్యాన్సర్‌ని ముందస్తుగా గుర్తించాలని రాష్ట్ర పరిశీలకులు సునీల్ కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ప్రజా వైద్య విధాన పరిషత్ అధికారి శిరీష ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు ఎంఎల్‌హెచ్‌పి సిహెచ్‌ఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలలో గర్భ ముఖద్వారా, నోటి, బెస్ట్ క్యాన్సరు గుర్తించాలని వీటిని ప్రారంభ దశలోనే స్క్రీనింగ్ చేయడం వలన వ్యాధి ప్రబలకుండా ముందస్తు మందులు, రేడియేషన్ తద్వారా వ్యాధిని వ్యాపింపకుండా చేయొచ్చన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించిన తర్వాత క్రమేపీగా మందులు తప్పనిసరిగా వాడే విధంగా చూడాలన్నారు. దీనివలన క్యాన్సర్ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తగిన మందులను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచిందని క్యాన్సర్ బారిన పడిన కుటుంబాలు భారీగా నగదును వెచ్చిస్తున్నారని వాటిని నిర్మూలిం చుకుని వారు ఆరోగ్యవం తులుగా తయారు కావాలన్నది ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్యాన్సర్‌పై శిక్షకులు స్వాతి, వైద్యులు విజయ్ కుమారి, ఆరోగ్య సిబ్బంది బృహస్పతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు

- కమిషనర్ డాక్టర్ జె.అరుణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లె వద్ద అన్నా క్యాంటీన్ ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్ పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కోరడంతో నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం సాయంత్రం అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. క్యాంటీన్ పునః ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పనులను సత్వరం ప్రారంభించాలని, క్యాంటీన్ పూర్తిస్థాయిలో నిర్వహణకు అవసరమైన అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పునఃప్రారంభానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఏపీ హంస నగరి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) నగరి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సర్వసభ్య సమావేశం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షులుగా విజయపురం పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట పి.మునిశేఖర్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా పచ్చికాపలం పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ పుష్పవాణి, నగరి ఏరియా ఆస్పత్రి స్టాఫ్ నర్స్ పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ స్వప్నమాధురి, బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ మహిళా కార్యకర్త కళాలు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులు, తాలుకా కార్యదర్శులుగా నింద్ర పీహెచ్‌సీకి చెందిన శ్రీదేవి, శ్రీనివాస నాయక్, ట్రేజరర్‌గా కార్వేటినగరం పీహెచ్‌సీకి చెందిన సుధాకర్, ప్రచార కార్యదర్శిగా విజయపురం పీహెచ్‌సీకి చెందిన సుధాకర్, మహిళా కార్యదర్శిగా నగరి ఏరియా ఆస్పత్రికి చెందిన నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీకి చెందిన నంబి మధు, జాయింట్ సెక్రటరీలుగా అమరావతి, ఇదయతుల్లా, పి.శాంతి, పి.సుమతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎ.ప్రత్యూష, కె.శివప్రసాద్, జి.రామ్మోహన్, కె.ప్రభావతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షులు రాజా మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యాన్ని కాపాడుతూ, పేద ప్రజలకి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న వైద్యారోగ్య శాఖా ఉద్యోగుల పక్షాన గత దశాబ్ద కాలంగా అలుపెరుగని సేవలు చేస్తున్న ఏకైక సంఘం హంస మాత్రమే అన్నారు. ఇది ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏకైక వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘమన్నారు. సంఘావిష్కరణ నుంచి తోడుగా నిలుస్తున్న వైద్యారోగ్య ఉద్యోగులు, డిమాండ్ల సాధనలో నిర్విరామంగా సేవలందించ గలిగిన వారికి మాత్రమే కార్యవర్గంలో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఉద్యోగులకు అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎన్నికలను సజావుగా నడిపి విజయవంతం చేసిన ఎన్నిక అధికారులు ఇమ్రాన్, ముఖేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టాటాబాయ్, శ్రీకాళహస్తి తాలుకా కార్యదర్శి గౌరి, కార్యనిర్వాహక కార్యదర్శి గిరిశ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

రక్తదానం ప్రాణదానంతో సమానం

డిఎంహెచ్‌వో ప్రభావతి దేవి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవంను అపోలో మెడికల్ కళాశాలలో రక్తదానాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రతి ఏటా జూన్14న రక్తదాన దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు. 18-55ఏళ్ల మధ్య వయస్సున్న ఆరోగ్యవంతులు మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని ఈ తెలిపారు. వారికి తిరిగి పది రోజుల్లోనే రక్తం శరీరంలో భర్తీ అవుతుందని స్పష్టం చేశారు. ఒకరి రక్తం నలుగురికి వివిధ రకాలుగా ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, అపోలో మెడికల్ కాలేజ్ పెథాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సిరాజిన్నిషా బేగం, డాక్టర్ భవదీప్, డీఎండీవో క్లస్టర్ దిశ శంకర్, రక్తదాత విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతలుగా మారండి: డాక్టర్ విజయులురెడ్డి

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ విభాగముల ఆధ్వర్యంలో కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వారి సహకారంతో "ప్రపంచ



రక్తదాతల దినోత్సవం" జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారి ప్రపంచాన్ని ఆరోగ్యవంతమైన ప్రదేశంగా మార్చడంలో సహాయ పడండి అని పిలుపునిచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపీనాథ్, గైనకాలజిస్ట్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఆర్థోపెడిషియన్ డాక్టర్ లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ అంబారీష్, కళాశాల అధ్యాపకులు కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు జర్నలిస్టుల సన్మానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు నిర్వహించిన అభినందన కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ హాజరైయ్యారు. వారిని మీడియా ప్రతినిధులు ఘనంగా సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు.

'విశ్వసనీయతకు మారుపేరు చంద్రబాబు'

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: విశ్వసనీయతకు మారుపేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలిచిపోతారనీ, ఇచ్చిన మాట ప్రకారం మొదటి సంతకం-మెగా డీఎస్సీపైన చేయడం అందుకు నిదర్శనమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు అన్నారు. చంద్రబాబు ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగానే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే సుమారు 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి మెగా డీఎస్సీని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్యగణనపై సంతకాలు చేయడం హర్షణీయమని శుక్రవారం కొనియాడారు. బుజ్జి, కోటా చంద్రశేఖర్, భాస్కర్, మణి, శివ, గణేష్, మైనారిటీ నాయకులు షేక్ జిలానీ, యస్.కె.సులేమాన్ పాల్గొన్నారు.

సీఎంని కలిసిన బాబునాయుడు

ప్రజాశక్తి-గుడిపల్లి: టీడీపీ గుడిపల్లి మండల అధ్యక్షులు బాబునాయుడు శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రస్తావించగా సానుకూలంగా స్పందించినట్లు బాబునాయుడు తెలిపారు.

సన్మానం

టీడీపీ గుడిపల్లి మండల అధ్యక్షులు బాబునాయుడుని ఉపాధిహామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు మండల పార్టీ మాజీ అధ్యక్షులు హేమంబర్ గౌడు, అగరం గ్రామ సర్పంచ్ గోపాల్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సుబ్రమణి తదితరులకు సన్మానం చేశారు.

మునీశ్వర ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి పట్టణ పరిధిలోని కశింమిట్ట వేల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మహామునేశ్వర ఆలయ కుంభాభిషేక వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, లక్ష్మీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కుంభాలంకార కార్యక్రమం నిర్వహించారు. మొదటి కాలయాగ పూజలను చేపట్టి ధీపారాధన చేసి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంజి, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: వేసవి తీవ్రతను పురస్కరించుకొని నగరి ఓంశక్తి ఆలయం వద్ద ప్రారంభించిన గంజి, మజ్జిగ పంపిణీ 64వ రోజుకు చేరుకోవడాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పమాలలతో అలంకరించారు. భక్తులకు, పాదచారులకు ఆలయం వెలుపల గంజి, అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్విరామంగా జరుగుతోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. దాతలకు ఆలయం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

పనిముట్లు అందజేత

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: వ్యవసాయ కూలీలకు సుచి స్వచ్ఛంద సంస్థ ద్వారా పనిముట్లు పంపిణీ చేశారు. శుక్రవారం జోడిచింతల సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 20మందికి పారా, గడపార చిన్న పారా, కొడవలి అన్న గిన్నె, టకారి, కత్తి, సుత్తి రెండు టెంకాయ చెట్లు ఎంపీడీవో సింగయ్య ద్వారా పంపిణీ చేశారు. సుచి స్వచ్ఛంద సంస్థ అధినేతలు పాల్ విజయ్ కుమార్, గ్లోరీ విజయ్ కుమార్‌లను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఏపీవో బాల, సిసి బాలకృష్ణ, సుచి సంస్థ సిబ్బంది ధనలక్ష్మి, జాబ్ జాన్సన్, చిన్నయ్య సాదు, సురేష్, యోహాన్ పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.4.66లక్షల ఆదాయం

ప్రజాశక్తి-సోమల: సోమల వారపు సంత వేలం పాటలో పంచాయతీకి రూ.4.66లక్షల ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. ప్రైవేటు బస్టాండ్ నిర్వహణ కోసం పాట వాయిదా పడినట్లు వివరించారు. పంచాయతీ పరిధిలోని చేపల చెరువుల నిర్వహణ కోసం వేలం పాటలు నిర్వహించాల్సి ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 16రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో వేలంపాటలను రద్దుచేసి నూతన ఫసిలి విధానంలో జిల్లా పంచాయతీ అధికారుల అనుమతితో తిరిగి నిర్వహించనున్నట్టు పంచాయతీ అధికారి సుధాకర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

'పెన్షనర్లకు బెనిఫిట్స్ సకాలంలో అందించాలి'

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: పెన్షనర్లకు అందాల్సిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం సకాలంలో అందించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎ.జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఆయన పెన్షనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దివంగత పెన్షనర్లకు, ఇటీవల మృతిచెందిన రామోజీరావుకు నివాళులర్పించారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందవలసిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందించి పెన్షనర్లకు ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం, సభ్యులు జనార్ధన్, రామచంద్రన్, మోహన్, పళని, సుమబాల, భానుమతి, తిలకం, వెంకట్రాజు, నాగార్జున, శివప్రసాద్, మునిరత్నం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మున్సిపల్ పరిధి బుగ్గ కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. బోధనా విధానాలను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు సులభరీతిన బోధించడానికి వినూత్న పద్ధతులను అవలంబిస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు.

సేవకునిగా పని చేస్తా

- ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-పూతలపట్టు: పార్టీలకతీతంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. పక్కాలగుట్టలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం అక్కడి స్థానికులతో మాట్లాడారు. ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో చర్చించి తగు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మురళిమోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పదవి హోదాకు మాత్రమేనని తాను రాజకీయాల్లోకి వచ్చింది సేవకునిగా పని చేయడానికని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత 15రోజులుగా కాలనీవాసులు తాగునీటితో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి సమస్య వచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన కాణిపాకం ఈవో

ప్రజాశక్తి-ఐరాల: పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్‌ని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వహణధికారి వెంకటేశు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. చిత్తూరులో ఆయన నివాసం వద్ద కాణిపాక ఆలయ వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

వసుంధర ఎగ్జిబిషన్ ప్రారంభం

ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని స్థానిక బిఎస్ఎన్ కళాశాల మైదాన ఆవరణంలో ఏర్పాటు చేసిన వసుంధర ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మల్లికార్జున, లక్ష్మీపతి, హేమావతి కలసి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి ఎగ్జిబిషన్ గూర్చి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వసుంధర బాహుబలి ఎగ్జిబిషన్ నిర్వాహలను ఆయన అభినందించారు.

శ్రీనివాసులురెడ్డిని కలిసిన జిల్లా రైతు సంఘ అధ్యక్షులు


రాష్ట్ర రైతు అధ్యక్షులుని కలిసిన నాగేశ్వరరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షు లు శ్రీనివాసులు రెడ్డిని విజయవాడలో చిత్తూరు జిల్లా రైతు సంఘ అధ్యక్షులు నగలపాటి నాగేశ్వరరాజు కలిసి రైతు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైతులకు మేలు చేసే వ్యక్తిగా అభివర్ణించారు. రాష్ట్ర రైతును కలిసిన సందర్భంగా ఆయనకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెంగ్రాయల్ యాదవ్, బిసి సంఘ సెల్ అధ్యక్షులు రవియాదవ్, పవనకుమార్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ముచ్చు కాలువ గ్రామంలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-సోమల: సోమలకు 80కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమల మండలానికే చెందిన ముచ్చు కాలువ గ్రామంలో సోమల పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 65ఆవులకు పిడుదల మందు పిచికారి, 15 దూడలకు, 400కు పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించడం జరిగిందని వైద్యాధికారిని చందన ప్రియా తెలిపారు. అనంతరం గ్రామంలోని వ్యాధిగ్రస్త పశువులకు శస్త్ర చికిత్సలు చేసి మందులు మాత్రలు పంపిణీ చేశారు. పశు యజమానులకు పశుపోషణ సంరక్షణ అంశాలపై సవివరంగా సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది బలరాం వెంకటరమణ రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎంపిపి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు పంచాయతీల్లో పర్యవేక్షణ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భౌగోళిక సమాచార వ్యవస్థ వినియోగం ఆధునీకరణకు నాంది

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): ప్రజారోగ్యంలో భౌగోళిక సమాచార వ్యవస్థ వినియోగం విప్లవాత్మకమైన ఆధునీకరణకు నాంది అని శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల తిరుపతి ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం "ప్రజారోగ్యంలో భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్) వాడకం' అనే అంశంపై ఓరియంటేషన్ ట్రైనింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ, వ్యాధులు, సేవల అందజేతపై జిఐఎస్ నిఘా, మ్యాపింగ్, వనరుల కేటాయింపు, రోగి సంరక్షణ కోసం ప్రాదేశిక విశ్లేషణను సులభతరం చేయడానికి ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిఐఎస్ ఫండమెంటల్స్, క్వాంటం జిఐఎస్ ను ఇన్‌స్టాల్ చేయడం, కోఆర్డినేట్ సిస్టమ్ మ్యాప్ ప్రొజెక్షన్ డేటా రకాలు, నేటి ప్రజారోగ్యంలో జిఐఎస్ అవసరం, నావిగేషన్ టూల్స్‌తో పని చేసే డేటాను జోడించడం, ప్రదర్శించడం, ప్రాదేశిక సమాచారాన్ని (డేటా) దృశ్యమానం చేయడం పై చెన్నై ఐసిఎంఆర్ నుండి డాక్టర్ ఆర్. శ్రీనివాసన్, వెట్రి చెల్వన్, చొక్కలింగంలు చక్క గా వివరిం చారు. ఈ వర్క్‌షాప్‌లో శ్రీ వేంకటేశ్వ ర వైద్య కళాశాల తిరుపతి వైస్ ప్రిన్సిపాల్ డియస్‌మూర్తి, ఎంఆర్ హెచ్ ఆర్‌యు నోడల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, అధ్యాపక బృందం, ఎంఆర్‌హెచ్ ఆర్‌యు చంద్రగిరి శాస్త్రవేత్తలు డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ యువి ప్రసాద్, సిబ్బంది, తిరుపతి యస్‌వి వైద్యకళాశాల, స్విమ్స్-శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సి టీబీ కుప్పం లోని పిఇఎస్ మెడికల్ కాలేజీ, కడప ప్రభుత్వ వైద్య కళాశాల నుండి అధ్యాపకులు పోస్ట్ గ్రాడ్యుయేట్ , పరిశోధన విద్యార్థులు, పాల్గొన్నారు.

ముగిసిన ఆర్యవర్క్ శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘం సభ్యుల సౌకర్యార్థం 84 రోజుల పాటూ నిర్వహిం చిన ఉచిత ఆర్య వర్క్ శిక్షణ శుక్రవారం రాస్ కార్యా లయంలో ముగిసిం ది. ఆర్య వర్క్ ముగింపు శిక్షణ శిబిరం సమావేశం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి టాటా హాస్పిటల్ పిఆర్‌డి హేమంత్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాస్ కార్యక్రమాలు ఆదర్శంగా నిర్వహిస్తున్నారని, మహిళలకు ఉన్న ఆరోగ్య సమస్యలు కాన్పులు వంటి వైద్య బృందం 24వ తేదీ సోమవారం 9 గంటలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గేటు పుత్తూరు రాస్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. అనంతరం రాస్ జె ఎస్ ఎస్ అధికారి హరి మాట్లాడుతూ మహిళల్లో ఆత్మ సైతం ఆర్థికాభివృద్ధి, 20 మంది మహిళలకు ఆర్య వర్క్ శిక్షణ అందించి వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం శిక్షణ పూర్తయిన వారికి. బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో.రాస్ అధికారి రవి, ప్రకాష్, జయంతి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే ఆ ఐదు సంతకాలు

బంగారుపాళ్యంలో

- టీడీపీ నేత వంశీ చౌదరి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: 4వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తొలి ఐదు సంతాలు చేయడం పేదల అభ్యున్నతికి ఉపయోగకరమైనవని టీడీపీ వాణిజ్య విభాగం బంగారుపాళ్యం మండల అధ్యక్షులు భాష్యం వంశీ చౌదరి అన్నారు. శుక్రవారం మండలంలోని గుంతూరు సచివాలయంలో సర్పంచ్ ద్రాక్షాయని ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. వంశీచౌదరి మాట్లాడుతూ డీఎస్సీ, పింఛన్ పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వంటి ఐదు కీలకమైన నిర్ణయాలపై సంతకం చేయడం శుభపరిణామం అని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీనా, మధుసూదన్ నాయుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్" రద్దుపై సీఎం చంద్రబాబు సంతకం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, సభ్యులు భాస్కర్, లోకేష్, జగదీష్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పుంగనూరు: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పుంగనూరు బార్ అసోసియేషన్ సభ్యులు పాలాభిషేకం చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో చిత్ర పటాలు ఏర్పాటు చేసి శుక్రవారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నకేశవులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూములు యాజమాన్య హక్కు చట్టం-2023(ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్)రద్దుకు సీఎం చంద్రబాబు రెండో సంతకం చేయడంపై న్యాయవాదులుగా హర్షంవ్యక్తం చేస్తున్నామన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో నుంచి న్యాయవాదులు ర్యాలీగా తరలి థాంక్యూ సీఎం, డిప్యూటీ సీఎం అంటూ కృతజ్ఞతలు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు న్యాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెంకట ముని, న్యాయవాదులు శ్రీనివాసులు, గురుమూర్తి, రవికుమార్, శైలేంద్ర, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సీఎం చంద్రబాబు గురువారం ఐదు హామీలపై సంతకాలు చేయడం పట్ల పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. సచివాలయంలో గురువారం మెగా డీఎస్సీ , పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపట్ల టిడిపి నేతలు మూడు రోడ్ల కూడలిలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శ్రీధర్ యాదవ్, దేవసుందరం, కోదండ రెడ్డి, జ్యోతి రెడ్డి, జీవరత్నం, సునీల్, మునిరాజ యాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమివ్వండి: ఎస్ఐ

మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకట నరసింహులు మండలంలోని పలువురు మహిళ పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామాలలో ఎలాంటి ఘర్షణ గొడవ అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే వెంటనే తెలియజేయాలని, నాటు సారా, బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ఉంటే వెంటనే సమాచారమివ్వాలన్నారు. ప్రశాంత వాతావరణంలో మండలం ఉండేవిధంగా మహిళా పోలీసులు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని సిడి కండిగ పంచాయతీకి చెందిన ఆకుల సుబ్రహ్మణ్యం 19వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అతని సుమార్తె సిడి కండిగా సర్పంచ్ ఆకుల మంగమ్మ, ఆకుల గోపి ఆధ్వర్యంలో రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు, స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతి ఏడది చేపట్టానున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి రెడ్డి, వెంకటేశులు, మునిమండడి, రాజారాం మండడి, మురళి పాల్గొన్నారు.

షణ్ముగం శెట్టికి నివాళి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కలపల్లి పంచాయతీకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షణ్ముగం శెట్టి గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఇది తెలుసుకున్న తీర్థం పంచాయతీ టీడీపీ నాయకులు గోవిందస్వామి, ఆర్ఎంపీ డాక్టర్ యూనియన్ లీడర్ శ్రీనివాసులు, చుట్టుపక్కల గ్రామాల రైతులు షణ్ముగం శెట్టి మృతదేహానికి పూలమాల వేసే నివాళులర్పించారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటియుసి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్టియు కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా సమితి సమావేశం జరిగింది. దాసరి చంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, ఏఐటీయుసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాగ సుబ్బారెడ్డి గారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పట్టల్ల సానుకూలంగా స్పందించి పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు.

స్విమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సదస్సు విజయవంతం

ప్రజాశక్తి - తిరుపతి: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ పద్మావతి వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ-1 లో ఎమర్జెన్సీ ఎపి -2024 పేరుతో రాష్ట్ర స్థాయి 4వ వార్షిక సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డాక్టరు ఆర్‌వి కుమార్, రిజిస్ట్రార్ డాక్టరు అపర్ణ ఆర్ బిట్లా. ఎస్‌పిఎంసి డబ్ల్యూ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టరు కె నాగరాజు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టరు కృష్ణ సింహా రెడ్డి, డాక్టరు మధుబాబు, రిటైర్డ్ ఎస్‌విఆర్‌ఆర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు భారతి, ఫిజియోథెరపి ప్రిన్సిపల్ డాక్టరు మాధవి జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌వికుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. క్రికెట్ ఆటలో ఆల్ రౌండర్ గా ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సు చదివినవారు పేషెంట్ కేర్ అత్యవసర చికిత్సలకు సంబంధించి సంపూర్ణ అవగాహనా నైపుణ్యం కలిగి ఉంటారని పేర్కొన్నారు. వైద్య విద్య చదవాలనుకొనే వారు నిస్సందేహంగా ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సును ఎంపిక చేసుకోవచ్చున్నారు. స్విమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ త్వరలో మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వారు మొదట 2019, 2021లో రెండు సార్లు కుప్పం పిఇఎస్ మెడికల్ కాలెజలో, మూడవసారి నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజ్‌లో నిర్వహించారని తెలిపారు. ఈ సారి మన స్విమ్స్‌లో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించి భవిష్యత్తులో పిజి వైద్య విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు.

స్కిల్ సర్వేలతో మరింత ఉపాధి: బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్కిల్ సర్వేలతో మరింత ఉపాధి అవకాశాలు వుంటాయని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేసిన ఐదు సంతకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును పునర్ నిర్మిస్తాయన్నారు. ప్రజల ఆస్తులకు హాని కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు పరచడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉన్న నైపుణ్యతను వెలికి తీసి వారికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కృత నిశ్చయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. ఇక రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు, విజయలక్ష్మి, రఫీ, సలీం, సతీష్, ఖాజా పాల్గొన్నారు.

16 నుండి సప్తగిరి సంగీత సప్తాహం: మురళీకృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అంతర్జాతీయ స్థాయిలో లబ్ధ ప్రతిష్టులైన కళా సరస్వతులను ఒకే వేదికపై జూన్ 16 నుండి, 23వ తేదీ వరకు 8 రోజులపాటు సప్తగిరీసునికి సప్తదిన సప్తస్వర నీరాజనం తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియం వేదికగా నిర్వహిస్తున్నామని పాస్ మనోవికాస్ ప్రత్యేక ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు రాత్రులు, ఏడు పగళ్ళు 128 గంటల పాటు నిర్విరామంగా ఈ సప్తస్వర నీరాజనం జరుగుతుందన్నారు. 16న శాస్త్రీయ సంగీత కచేరీలు, 17న సంప్రదాయ నామ సంకీర్తనలు, 18న హరికథ గానాలు, 19న పురందరదాసా కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం, 20న భద్రాచల రామదాస, అపురూప వాగ్గేయకారుల కీర్తనలు కృతుల గానం, 21న అన్నమాచార్య సంకీర్తనల విభావరిలు, 22న అన్నమాచార్య భక్తి భావ స్వర తరంగాతరంగాలు, 23న కార్యక్రమ సమాప్తానికి సంబంధించి పలువురు ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గంగమ్మ గుడి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గంగమ్మ గుడి ప్రాంతానికి చెందిన సావిత్రి (65) శుక్రవారం ఉదయం వాకింగ్ వెళ్తుండగా చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి గంగమ్మ గుడి మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజా కుల్లాయప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి కాయల ట్రాక్టర్ బోల్తా

- తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలో మామిడికాయల ట్రాక్టర్లు ఒకే రోజు రెండు చోట్ల బోల్తా పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి, కొత్తపల్లి మిట్ట తిరుపతి రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. కాయలు తోలే క్రమంలో కొత్తపల్లి మిట్ట వద్ద శుక్రవారం ఓ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడ ఏవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే క్రమంలో బొమ్మేపల్లి నుంచి పిల్లారి కుప్పం జంగాలపల్లి వద్ద ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీకి మామిడి రైతు ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్తుండగా కుక్క అడ్డంరావడంతో తప్పించబోయి అదుపుతప్పి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి చిన్న తయ్యూరు దగ్గర ట్రాక్టర్ చక్రాలు విరిగిపోయి పడిపోయింది. సంఘటనల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఓవర్ లోడ్ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్‌కు 14రోజుల రిమాండ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గత నెల 28వ తేదీ పట్టణంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఆటో డ్రైవర్ నాగరాజు మద్యం సేవించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొన్నారు. మద్యం మత్తులో ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీ కొట్టాడు. ఆటోలో ఉన్న కన్నమ్మ అనే మహిళ గాయాలపాలైంది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు ముద్దాయిపై నమోదు చేసిన కేసును దర్యాప్తు చేశారు. శుక్రవారం ఆటో డ్రైవర్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా జడ్జి మాధవి లత అతనికి 14రోజుల రిమాండ్ విధించారు.

ఎమ్మెల్యే నానిని కలిసిన నేతలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఎస్ఆర్ పురం మండలం తెలుగు యువత ఉపాధ్యక్షుడు పేనేని ధనుంజయ నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు జమీర్ తదితరులు ఉన్నారు.

'బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి'

ప్రజాశక్తి-సదుం, సోమల: బాల కార్మికుల అవగాహనా వారోత్సవాలు సందర్భంగా సమగ్ర శిక్షా పాఠశాలల ప్రత్యేక సమన్వయ కర్త నాలి అజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సదుంలో శుక్రవారం బాల కార్మికుల సదుం, సోమల మండలాల్లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు కార్మిక శాఖ, మండల లీగల్ సర్వీస్ కమిటీ, మండల అంగన్వాడీ, విద్యా శాఖ, గ్రామ పోలీస్ అధికారులు సమన్వయంగా సదుం ఏరియాలోని మెకానిక్ షెడ్లు, హోటళ్లు, వర్క్ షాప్‌ల ప్రాంతాలలో తిరిగి బడి ఈడుపిల్లలను బడిలో చదువు కొనేవిధంగా అవగాహనా కల్పించారు. బాలకార్మికులుగా చేర్చుకొంటే చట్టం ద్వారా శిక్షింప బడుతారని వారిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కెఆర్ ఆనంద్ బాబు, సిఆర్‌పి విశ్వనాథ్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ మల్లీశ్వరి, ఎన్‌జిఓ గట్టప్ప, ఉమాదేవి, ఆసియా పాల్గొన్నారు.